# ఓ రిస్టువాచీ కథ

ఎ.వి.సుబ్బలక్ష్మి



ఏమిటి? వాచీ ఆగిపోయిందా? ఇన్నాళ్ళకి, ఈ వాచీకి రిపైరు కావలసి వచ్చిందా? కలా! నిజమా! అని మరొక్కసారి ఆగిపోయినదాన్ని చూస్తున్న నాకు, దాని గత చరిత్ర సినిమా రీలులా గిర్రున తిరిగింది.

నేను ఎం.ఎస్‌సి. చదివే రోజులవి. నేనూ, నా స్నేహితురాలు ఎన వాల్తేరులో ఒక రూమ్‌లో వుండేవాళ్ళం.

మేమున్న గది చాలా చిన్నది. గదికి ఒక పక్క యూనివర్సిటీలో పనిచేస్తున్న తెలుగు లెక్చరరు గారి కుటుంబం వుండేది. మరొక పక్క పెద్ద వరండా. చుట్టూ గ్రిల్. మేడ కింది భాగంలో రెండు వాటాలుండేవి. ఒక వాటాలో ఇల్లుగలవాళ్ళు, మరొకవాటాలో డాక్టరు వుండేవాళ్ళు. ఇంటి చుట్టు పెద్ద కాంపౌండు మొక్కలతో కలకలలాడుతుండేది.

ఇల్లుగల తాతగారు చాలా ముసలాయన. భార్య పోయి చాలా కాలమయిందట. ఆయన దగ్గర ఒక విధవరాలైన అక్క, భర్త వదిలేసిన చెల్లెలు వుండేవారు. ఆయనకు ఒకే ఒక కూతురు. ఆయన పంచ ప్రాణాలు ఆమే. ఆ కూతురికి వెతికి వెతికి రైల్వేలో పని చేస్తున్న, సౌమ్యుడైన నారాయణగారితో పెళ్ళిచేసి ఇల్లరికం తెచ్చుకున్నాడు.

ఆ ముసలాయన పూర్వం పక్కనే వున్న పిచ్చాసుపత్రిలో జవానుగా పనిచేసి ఆ మేడ కట్టారని వినికిడి.

ఇక ఇంట్లో ఆయన అక్కచెల్లెళ్ళు జీతం బత్తెం లేని దాసదాసీజనాలైతే, కూతురొక మహారాణి. అల్లుడు మహారాజు. మనవలు దొరబిడ్డలు. తాతగారి కూతురి కుటుంబ సేవల్లో ముసలాయన తోబుట్టువులు ఎప్పుడూ మునిగి తేలుతుండేవాళ్ళు.

మేడ మీద మా గది ఎంత చిన్నదంటే, నేను పడుకుంటే పాదాలు బయట వుండేవి. రికార్డు వర్కు చేసుకుంటూ వుంటే లేచే పని వుండేది కాదు. ఎందుకంటె ఎటు చెయ్యి పెట్టినా వస్తువులన్నీ చక్కగా అందేవి.

కొత్తల్లో అయితే గదిలోనే మగ్గేవాళ్ళం. నెమ్మదిగా మా మకాం వరండాలోకి మార్చాం. అంచెలంచెలుగా ముందు మడత మంచాలు, క్రమంగా పుస్తకాలు, ఆపైన మిగిలిన సరంజామా అంతా వరండాలో చోటు చేసుకున్నాయి.

మా పక్క లెక్చరరుగారు చాలా మంచివాళ్ళు. స్నేహంగా వుండేవాళ్ళు. వస్తువులు పోతాయన్న భయం లేదు. కారణమేమిటంటే — పైకి వెళ్ళే ప్రతి వ్యక్తి

ఇల్లుగలాయనికి ఏం పనిమీద, ఎవరికోసం పైకె వెడుతున్నదీ చెప్పకుని వెళ్ళాల్సిందే.

తాతగార్కి వదువుకునే పిల్లలంటే చాలా ఇష్టం. "అమ్మా! పద్మావతీ! ఎలా వదువుతున్నారు?" అని నోరారా పలకరించేవారు.

మేం కూడా వాళ్ళను చాలా గౌరవంగా చూసేవాళ్ళం. నీళ్ళఎద్దడికి లోనయ్యేవిశాఖపట్నంలో మేమున్నా మాకెప్పుడూ నీళ్ళ కొరత వుండేది కాదు. పంపులు ఏ అర్థరాత్రి-అపరాత్రి వచ్చినా టాంకునిండా నింపి నిల వ చేసేవాళ్ళు. దేనికీ ఇబ్బంది వుండేది కాదు. మేడ మీద కూర్చుని హాయిగా వదువుకునేవాళ్ళం.

నేనూ, నా స్నేహితురాలు కలసి ఒక క్యారేజి తెప్పించుకుని తినేవాళ్ళం. ఆమెకు కాఫీ అలవాటు లేదు. నాకు కాఫీ లేనిదే తోచేది కాదు. అటు పెరుగుకీ, ఇటు కాఫీలకి పనికి వస్తాయని ఇద్దరం కలిసి ఒక సీసా పాలు తెప్పించుకోవాలనుకున్నాం.

పొద్దునే పాలు తెచ్చే ఒక కుర్రాడిని తాతగారే మాట్లాడి పెట్టారు. సుమారు వాడికి పదకొండు సంవత్సరాలుండేవి. పేరు రాము. చాలా అమాయకంగా వుండేవాడు.

వాడికి తల్లి లేదు. చిన్నప్పుడే చనిపోయిందట. తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకుని ఎక్కడికో వెళ్ళిపోయాడు. వాడిని



సాకే భారం వాడి అమ్మమ్మ మీద పడింది. ఆమె పాచి పనులు చేసుకుని బతుకుతుండేది.

మాకు ఈ సంగతులు తెలిశాక ఆ కుర్రాడి మీద సానుభూతి పెరిగిపోయింది. మేం ఏం తిన్నా వాడికి కూడా కాస్త పెట్టేవాళ్ళం. పాలు రెగ్యులర్‌గా తెస్తూ, చిన్న చిన్న పనులు చేసి పెడ్తూ వుండేవాడు.

అలా వుండగా ఒక రోజు నా 'హీరో పెన్' కనిపించలేదు. ఎంత వెతికినా కనిపించలేదు. ఎక్కడో ఏ దారిలోనే పడేసుకుని వుంటానని సరిపెట్టుకున్నాను.

మళ్ళీ కొన్నాళ్ళకి నా ఫ్రెండు పెన్ను పోయింది. ఆమె క్రితం రోజు రాత్రి ఆ పెన్నుతోటే నోట్సుకూడా వ్రాసింది. నాకు కూడా గుర్తే. ఉదయానికల్లా ఎలా మాయమయింది? ఎవరిని అడుగుతాం?

ఇల్లు గలవాళ్ళతో చెప్తే ఎలా వుంటుంది? ఏమయినా అనుకుంటారేమో! పోనీ పక్కవాళ్ళ నడిగితే! బాగుండదేమో! అనుకుంటూ కొన్ని రోజులు భయపడి బాధపడి క్రమంగా మర్చిపోయాం.

ఫస్టియర్ పరీక్షలు దగ్గర పడడంతో చదువులో మునిగిపోయాం.

ఆ రోజు పరీక్షల కెళ్ళే ముందు వాచీకోసం వెతికాను. కనిపించలేదు. ఎక్కడో పెట్టి వుంటావులే అని నా స్నేహితురాలు అనడంతో అన్యమనస్కంగానే పరీక్షకు వెళ్ళిపోయాను.

వచ్చాక అంతా వెతికాం. ఎక్కడా కనిపించలేదు. నాకు మాత్రం ఆ రోజు రాత్రి పడుకునేముందు టైము కూడా చూసుకున్నట్టు గుర్తు. రాత్రికి రాత్రి ఎలా పోయినట్లు — అంతుబట్టలేదు.

పరీక్షలయిపోయాక మళ్ళీ పదిసార్లు వెతికి, పోయిందని నిశ్చయించుకున్నాక, మెల్లగా పక్క వారికి, తాత




గారికి సంగతి చెప్పాం.

మా పక్కవాళ్ళ ఇంట్లో ఒక ముసలమ్మ పని చేసేది. ఒకటే నసుగుడు మనిషి. అందులోను అది రెండు, మూడు గిన్నెలు వాళ్ళవి మాయం చేసిందట. ఇల్లుగలవాళ్ళ చెంబొకటి కాజేసిందని అన్నారు.

ఇంకేముంది — అదే కాజేసి వుంటుంది. పోలీసు రిపోర్టు ఇవ్వండి అన్నారు.

ఎందుకు లెద్దురూ! లేనిపోని గొడవ. పోయిందె లాగూ పోయిందని మేమన్నా సరే, నాకు తెలిసినవాళ్ళు వున్నారని చెప్పి తాతగారు పోలీసు రిపోర్టు ఇప్పించారు. పోలీసులు వచ్చి ముసలమ్మను స్టేషన్‌కి తీసుకువెళ్ళి నాలుగేశారు. ఎంత హింసించినా లబో దిబోమని శాప నార్థాలు పెట్టింది గాని, వాచీ మాత్రం బయట పెట్టలేదు. ఒక రోజంతా దాన్ని నానా రకాలుగాను బాధపెట్టి వదిలేశారు.

ఆ దెబ్బతో పక్కవాళ్ళ పని మానేసింది ముస లమ్మ. పోలీసువాళ్ళు మాకొక పాతిక రూపాయిలు వదిలించారు.

వాచీ పోయిన బాధకుతోడు ఇదొక నష్టమని చాలా రోజులు విచారించాం.

ఆ వాచీని మా మామయ్యగారు రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మిలిటరీలో పనిచేస్తూ, జర్మనీ వెళ్ళినప్పుడు అక్కడ నుంచి దాన్ని మా అత్తయ్యకు కొనుక్కొచ్చారట. ఆ వాచీకి మా అత్తయ్య రోజూ కీ ఇచ్చి పెట్టెలో దాచేదట. ఎప్పుడూ పెట్టుకునేది కాదు.

మా అత్తకు నా వయసు కూతురుండేది. అది చదువుకుని, టైము చూడడం నేర్చుకుంటే, దానికి ఇవ్వాలని ఆవిడ కోరిక. కాని ఆవిడ కోరిక ఫలించలేదు. మా అత్తయ్య కూతురు రెండవ తరగతితోనే ఆపే సింది. ఈ లోపులో మామయ్యగారు పోయారు.

నేను డిగ్రీ చదువుతుండగా–"ఒసే! పద్దూ! నువ్వు ఫస్టుక్లాసులో పాసయావంటే నీకీ వాచీ బహుమతిగా ఇచ్చేస్తానే!" అంది అత్తయ్య మాట వరసకు.

మా అత్తయ్య నోటివాక్కు ఫలించి నాకు క్లాసు వచ్చింది. సంతోషంగా ఆ వాచీని నాకిచ్చేసింది అత్తయ్య.

వాచీ చూడముచ్చటగా వుండేది. రోఫీనా వాచి. ఇరవై ఒక్క జువెల్స్. స్విట్జర్లాండ్‌లో తయారైంది. గోల్డ్ కేస్‌తో మెరిసిపోతూ తళతళలాడిపోయేది. అప్పటి నుంచి ఆ వాచీ నా చేతిని వదలలేదు.

ఒక రోజు నీళ్ళు తోడుతుండగా, వాచీ చైన్ సరిగా లేదో ఏమో కాని పుట్టుక్కున నూతిలో పడింది.

నేను చాలా కంగారుపడ్డాను. అమ్మ నా అజాగ్రత్తకు దండకం మొదలుపెట్టింది. మా తాతగారు మాత్రం ధైర్య సాహస ప్రదర్శనలో భాగంగా నూతిలో దిగారు. నుయ్యి ఎక్కువ లోతు లేదు. వాచీ పైకి తీశారు.

ఆశ్చర్యం! వాచీ చెక్కు చెదరలేదు. చుక్క నీళ్ళు కూడా లోపలికి పోలేదు. సెకండ్ల ముల్లు దగ్గర నుంచి మామూలుగానే తిరుగుతున్నాయ్.

"మీ మామయ్యగారి సొమ్ముకి ఆయుష్షు ఎక్కువేనే అమ్మాయ్!" అంటూ అత్తయ్య దీర్ఘాలు తీసింది.

"ఇదంతా నేను టైముకి తెగించి, నూతిలో దిగి



ఇటీవల నెల్లూరులో ప్రముఖ సాంస్కృతిక కళాసంస్థ 'కళాప్రియ' ఏర్పాటు చేసిన 'భరతనాట్యం' కార్య క్రమంలో ప్రదర్శనఇస్తున్న కుమారి సుజాతా శ్రీనివాసన్

తియ్యబట్టి" అని పోజు కొట్టారు తాతయ్యగారు.

అటువంటి వాచీ పోగొట్టుకున్నానని సెంటి మెంటల్‌గా ఫీలయాను. ఏం చేస్తామని సరిపెట్టు కున్నాను. క్రమంగా మరచిపోయాను.

సెకండియరు పరీక్షలు రెండు నెలలున్నాయనగా మా పక్కావిడ నెమ్మదిగా మా దగ్గరికి వచ్చి "మా బాబు స్లిప్పర్లు పోయాయి" అన్నారు ఒక రోజు.

ఎక్కడో వదిలి మరచిపోయి వుంటాడని మేం సరిపెట్టాం. మరొక వారానికి బెల్టు షూ పోయిందని బాధ పడ్డారు.

ఎవరికీ పనిమనిషి కూడా లేదు. పరాయి వాళ్ళెవరు రారు. ఎవరు చేస్తున్నారీ పని? అర్థంకాక రెండు రోజులు బుర్ర బద్దలు కొట్టుకున్నాం అందరం కలిసి.

మా పక్కావిడ మాత్రం "నాకా పాలకుర్రాడిమీద అనుమానంగా వుందండీ" అన్నారు.

అనటమే తడవుగా ఆమెను తిట్టినంత పనిచేశాం! "ఆ కుర్రాడు చాలా మంచివాడు. మీరు అనవసరంగా అనుమాన పడుతున్నారు!" అని వాడి మంచిని వర్షంగా కురిపించేశాం మాటల్తో కలిసికట్టుగా మేమిద్దరం ఆమె ముందు. అప్పట్లో ఆమె ఊరుకున్నారు.

ఒక రోజు సాయంత్రం కావాలని ఆవిడ మెట్ల దగ్గర కిటికీలో పెన్ను పెట్టారట. ఉదయానికి అది కనిపించ లేదు. "నేను దొంగను పట్టాను." అని ఉదాహరణతో సహా వివరించారామె. మేం అంతగా పట్టించుకోలేదు.

క్రమంగా ఆవిడ వాడిని మచ్చిక చేయటం ప్రారం భించారు. వాళ్ళ కుర్రాడి పాత చొక్కా ఒకటిచ్చారు. రోజూ చాక్‌లెట్ లవీ ఇవ్వటం మొదలుపెట్టారు. చిన్న చిన్న పనులవీ చెప్తూ, డబ్బులు కూడా ఇచ్చారు.

ఒక రోజు వాడిని చేరదీసి-

"ఒరే రామం. మొన్న మా యింట్లో మంచి పెన్ను పోయిందిరా!" అన్నారట.

"నేను తియ్యలేదు. నాకేమీ తెలియదు అమ్మ గారూ!" అన్నాడట.

"ఛ! ఛ! నువ్వెందుకు తీస్తావ్? నువ్వు చాలా మంచి కుర్రాడివి. నీ స్నేహితుడున్నాడు చూడు. వాడు తీసి వుంటాడు. నీకొక రూపాయి ఇస్తానుగాని, వాడి దగ్గర నుంచి ఆ పెన్ను కాస్త తెచ్చిపెడుదూ!" అని రూపాయి చేతిలో పెట్టారట.

మర్నాడు పొద్దున్నే పెన్ను పట్టుకొచ్చి-

"అమ్మగారూ వాడేనండీ దొబ్బాడు. వాడ్ని తన్ని నేను పెన్ను పట్టుకొచ్చాను!" అని పోజు కొట్టాడట.

ఆవిడ ఆ విధంగా వాడిని ట్రాప్ చేసి పెన్ను తెప్పించారు.

ఆవిడ అసలు వాడిని అనుమానించటానికి కారణ మేమిటంటే రాము వయసు, వాళ్ళ అబ్బాయి వయసు ఒకటే. అందువల్ల వాళ్ళ కుర్రాడి చెప్పులు రాము తప్ప మరెవ్వరూ తీసి వుండరని ఆమె నమ్మకం.

రెండవ రోజు ఈ ట్రిక్కు మహిమవల్ల స్లిప్పర్లు, బూట్లు కూడా వచ్చాయి.

మాకిక నమ్మక తప్పలేదు.

'ఇటువంటి వెధవని, తల్లి లేదని జాలిపడి ఎంతగా చేరదీశాం!' అని నేను, నా స్నేహితురాలు తెగవాపోయాం.

మా పెన్నుల కోసం కూడా ఆవిడ లయలు వేశారు. కాని పనిచెయ్యలేదు. బహుశా చాలా కాల మయిపోయింది కాబట్టి అవి చేతులు మారి వుండ వచ్చును- అని అభిప్రాయపడ్డాం.

వాచీ కోసం చాలా ప్రయత్నించాం. పెద్ద పెద్ద లంచాలే ఎర చూపాం. కాని సంవత్సరం తర్వాత వాచీ లాంటి వస్తువెలా వస్తుంది. మా ఆశగానీ!

మేము ఒకరోజు డాబామీద కూర్చొని చదువు కుంటూ వుండగా, ఎదురింటివాళ్ళ అమ్మాయి పరు గెత్తుకుంటూ వచ్చి -"అక్కా! నీ వాచీ పెట్టుకుని మా ఇంటికి ఈ రోజు మీ పాల అబ్బాయి వాళ్ళ పిన్ని పేరంటానికి వచ్చింది.

నేను ఎంతో పరీక్షగా చూశాను. ఆవిడ గమనించలే దనుకో. అది నీ వాచీనే! సందేహం లేదు" అంది.

ఉరుకులు, పరుగులతో ఆత్రతగా వాళ్ళ ఇంటికి వెళ్ళేసరికి ఆమె వెళ్ళిపోయింది. మరెలా? ఇప్పుడేమి చెయ్యటం?

సరే మా డిటెక్టివ్‌గారి ( పక్క లెక్చరర్‌గారి భార్య) సలహా అడిగాం. ఆమె "మంచి బలగంతో వెళ్ళి బెదిరించి తీసుకోవటమే-" అన్నారు.

ఇల్లుగల తాతగారు చనిపోయి మూడు నెలలయింది. లేకపోతే ఆయన కావలసినంత హంగామా చేసేవారే!

ఆలస్యం చేసి లాభం లేదని నిర్ణయించుకున్నాం. అదృష్టం కొద్దీ మా మామయ్యగారు నెల్లాళ్ళముందు ఎస్.ఐ.గా ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు.

హ్మూహాహాటిన వెళ్ళి ఆయన సహాయం కోరాం. వెంటనే ఆయన ఒప్పుకున్నారు. ఒక పోలీసు కానిస్టేబుల్‌ని వెంట తీసుకుని మాతో వచ్చారు.

అందరం కలిసి పదిమంది దాకా చేరాం. ఇల్లు తెలుసు కాబట్టి అందరం కలిసి వాళ్ళ ఇంటి మీద దాడి చేశాం.

మం వెళ్ళేటప్పటికి రాత్రి ఏడు దాటింది. ఆఫీసు నుంచి పాలబ్బాయి బాబాయి వచ్చి వున్నారు.


పోలీసులతోపాటు, ఇంతమందిని చూసేసరికి ఆయన కాస్త కంగారు పడ్డారు.

మా ఎస్.ఐ. మామయ్యే చొరవ తీసుకొని ఎంతో నేర్పుగా అడిగారు. వాళ్ళకది వెన్నతో పెట్టిన విద్యకదా! "మా మేనకోడలు వాచీ అమధ్య ఎక్కడో జారిపోయింది. మీ భార్యకు దొరికినట్లు విన్నాం. ఈ రోజు ఆవిడ పేరంటానికి పెట్టుకొని వస్తే చూశాం.

"పాపం! ఆవిడగార్కి ఎవరిదో తెలియకపోవడం వల్లనూ, వాడకుండా అట్టేపెడితే పాడయిపోతుందన్న ఉద్దేశ్యంతోను చేతికి పెట్టుకొని వుంటారు. ఎంతకాలమని దాస్తారు చెప్పండి?

"గొడవ లేకుండా వాచీ ఇప్పిస్తే వెంటనే వెళ్ళిపోతాం. లేకపోతే స్టేషన్, కేసు వగైరా గొడవలెన్నో వస్తాయి. మరి మీ ఇష్టం" అన్నారు.

ఆయన చాలా ఖంగుతిన్నారు. "నాకేమీ తెలియదండీ. కనుక్కుంటానుండండి... ... ..."




అని అరుపులాంటి పిలుపుతో ఆమెను పిల్చారు.

ఆమె తెలివైన ఘటమనుకుంటా. "అవునండీ! నేను అంతా వింటూనే వున్నాను. నాకు ఆ వాచీ చాలాకాలం క్రితమే దొరికింది రోడ్డుమీద. అందర్నీ మీదా, మీదా అని అడిగాను. ఎవరూ మాదంటే మాది కాదన్నారు.

"పోనీ చేతికి పెట్టుకుంటే చూచి ఎవరైనా గుర్తుపడ్తారుకదా అని ఇవేళ పెట్టుకున్నాను. అంత మాత్రానికి ఇంత మంది రావాలా? నన్నడిగితే నేనే ఇద్దును కదా! అని వాచీ తీసి ఇచ్చివేసింది.

అలా పోయిన నా వాచీ సంవత్సర కాలం తర్వాత నాకు చేరింది.

నెమ్మదిగా తేలిన నిజమేమిటంటే-ఆ రాము మా ఇంట్లో తెల్లవారుఝామున పాల సీసాలు ఇచ్చే సందర్భంలో అక్కడ అందుబాటులో వున్న వస్తువుల్ని సంగ్రహించి వాళ్ళ అమ్మమ్మకి అందజేసేవాడు.

వస్తువులు, పెన్నులు, పెన్సిళ్ళు కావటంతో ఆమె పెద్దగా పట్టించుకోలేదు. వాచీ తెచ్చినపుడు మాత్రం కంగారుపడి, ఇంట్లో వుంటే ప్రమాదమని, చిన్న కూతురిదగ్గర దాచింది.

ఆ కూతురు దాన్ని సొంతం చేసుకుని చాలా కాలం దాచింది. సంవత్సరమయిపోయిందిగదా! ఇక పర్వాలేదని ఒక్కసారి పెట్టుకోవాలన్న కులబాటంతో పెట్టుకునే సరికి గుట్టు రట్టయింది.

ఆమె భర్త సహజంగా మంచివాడు కావటంతో మా వస్తువు మాకు సులభంగా దక్కింది.

అంతటి చరిత్ర గల ఈ వాచీ ఆగిపోయింది. బాగుచేయించుకోవాలి- అనుకుంటూ ముందుకు నడిచాను విసురుగా.

ఆ కుదుపుకి మళ్ళీ యథాప్రకారం తిరగటం మొదలుపెట్టింది ఆ మొండి వాచీ! ●